క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సీఎస్ఐ చర్చికి రూ.50 వేలు విరాళం



కస్టమ్స్ అధికారి ఆనంద్ కుమార్‌ను సన్మానిస్తున్న సీఎస్ఐ సంఘస్తులు

మిడుతూరు: స్థానిక సీఎస్ఐ చర్చి నిర్మాణానికి కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి సంఘస్థులు నూతన చర్చి నిర్మాణం తలపెట్టామని, మీ వంతు సహాయం చేయాలని సంఘ పెద్దలు కోరారు. దీంతో చర్చి నిర్మాణానికి రూ.50 అందజేశారు. అనంతరం సీఎస్ఐ సంఘస్తులు కస్టమ్స్ అధికారిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శంకర్ గౌడ్, సంజీవ రాయుడు, ఎల్లగౌడ్, నర్రా చెన్నయ్య, రాజేంద్ర, రవి, సీఎస్ఐ సంఘస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రాల అభివృద్ధే ధ్యేయం



బొల్లవరంలో సంక్షేమ పథకాల వీడియోలను వీక్షిస్తున్న ప్రజలు

నందికొట్కూరు రూరల్: రాష్ట్రాల అభివృద్ధే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ధ్యేయమని వీఎస్‌బీవై కోఆర్డినేటర్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని బొల్లవరం, దామగట్ల గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు సంక్షేమ పథకాలను గురించి వివరించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, ఏపీఓ అలివేలు మంగమ్మ, ఎంఈఓ ఫైజున్నిసా తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలను ఆచరించాలి



సనాతన సంప్రదాయాలను ప్రజలకు వివరిస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

జూపాడుబంగ్లా: హిందూధర్మ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. ఆదివారం మండలంలోని తరిగోపుల, పి.లింగాపురం గ్రామాల్లో హిందూధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క హిందువు సనాతన హిందూధర్మ సంప్రదాయాలను పాటించాలన్నారు. ఇతరులకు హాని చేయకుండా దానధర్మాలు చేయటం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శేషన్న, కుమారాచారి, సంజీవ, పార్థసారథి, చక్రపాణి, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

కేసీ వెంట విద్యుత్ మోటార్లపై దాడులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో కేసీ కెనాల్ కాల్వ వెంట రైతులు పంట పొలాలకు సాగునీటి కోసం వేసుకున్న నీటి మోటార్లపై ఇరిగేషన్ శాఖ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి, డీఈ సుబ్రహ్మణ్యం రెడ్డి, సిబ్బంది దాడులు నిర్వహించి మోటార్లు, పైపులను తొలగించారు. కేసీ కాల్వపై మోటర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని రైతులను హెచ్చరించారు. రైతులకు రెండవ పంటకు నీరు ఇచ్చేందుకు సరిపడా నీటి లభ్యత లేదన్నారు. రైతులు వరి పంటలు వేసుకుని నష్టపోవద్దని అవగాహన కల్పించారు. బండిఆత్మకూరు మండలంలో రైతులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలకు పంపిణీ చేశారు.

క్రీస్తు పుట్టుక.. లోకానికి పండుగ



కొత్తపల్లి చర్చిపై ఏర్పాటు చేసిన నక్షత్రం

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు
- ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు

ఆత్మకూరు/నందికొట్కూరు: క్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం క్రిస్మస్ వేడుకలకు పలు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన ప్రార్థనా మందిరాలైన సీఎస్ఐ చర్చి, ఏబీయం, ఎస్పీజీ పాలెం పాటు కప్పలకుంట్ల దుద్యాల రస్తా, ఇందిరా నగర్‌లోని పలు ప్రార్థనా మందిరాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. నందికొట్కూరులోని సీఎస్ఐ టౌన్ చర్చి, ఏబీఎం చర్చి తదితర ప్రార్థనా మందిరాలను రంగురంగుల విద్యుత్ వెలుగులతో, స్టార్లతో చర్చీలను అందంగా తీర్చిదిద్దారు. క్రీస్తు జన్మదినం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. పలు చర్చీలలో ఏసు జననం ఇతివృత్తాంతం తెలిపే గొర్రెల కాపరులు సూచికలతో పశువుల పాక సెట్టింగ్‌లతో తీర్చిదిద్దారు. అలాగే క్రైస్తవులు తమ ఇళ్లను విద్యుత్ దీపాలతోపాటు స్టార్లతో అలంకరించుకున్నారు.

ప్రార్థనా మందిరాలు సిద్ధం

పగిద్యాల: మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పడమర వనుములపాడు, సంకిరేణిపల్లె, పగిద్యాల, బీరవోలు, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం పీకే ప్రాగటూరు గ్రామాల్లోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలకు సమాయత్తమయ్యారు. చర్చీల గోడలపై పవిత్ర గ్రంథమైన బైబిల్‌లోని యేసుక్రీస్తు పుట్టుక విశేషాలను తెలియజేసే చిత్రాలు, దేవుని నీతి వాక్యాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.


కొత్తపల్లి/శ్రీశైలంప్రాజెక్ట్: యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకొనే క్రిస్మస్ పర్వదినానికి మండలంలోని ఆయా మందిరాలు ఆదివారం ముస్తాబయ్యాయి. చర్చీల ముందు యేసుక్రీస్తు పుట్టుకను తెలిపే స్టార్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి చర్చీలలో క్యాండీల్స్ వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేసి క్యాండిలైట్ సర్వీస్ కార్యక్రమాలు నిర్వహించారు.



గువ్వలకుంట్లలో క్రిస్మస్ పర్వదినానికి ముస్తాబైన ఆర్సీఎం చర్చి



అందంగా అలంకరించిన ఇందిరానగర్‌లోని సీఎస్ఐ ప్రార్థనా మందిరం



ఆత్మకూరు ఎస్పీజీ పాలెం ప్రార్థనా మందిరం

పట్టణంలో క్రిస్మస్ సందడి

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం క్రిస్మస్‌సందడి కనిపించింది. సోమవారం క్రిస్మస్‌పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులు నూతనవస్త్రాలు, స్టార్లు, బెలూన్లు, పూలమాలలు తదితర వస్తువులు కొనుగోలు చేశారు. అన్ని దుకాణాల వద్ద భారీగా కొనుగోలు చేయడంతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని కప్పలకుంట్ల, గౌడ్ సెంటర్, కర్నూలు, గుంటూరు ప్రధాన రహదారుల వద్ద క్రిస్మస్ సందడి నెలకొంది.



కిటకిటలాడుతున్న కప్పలకుంట్ల దుకాణాలు



జూపాడుబంగ్లా ఆర్సీఎం చర్చిలో ఏర్పాటు చేసిన పశువులపాక



ముస్తాబైన పగిద్యాల దేవనగర్ ఏబీఎం చర్చి



ముస్తాబైన నందికొట్కూరు సీఎస్ఐ టౌన్ చర్చి



విద్యుద్దీపాలంకరణ అలంకరణలో సీఎస్ఐ టౌన్ చర్చి



విద్యుత్ అలంకరణలో సున్నిపెంట లూథరన్ చర్చి

రమణీయం.. శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

ఆత్మకూరు: వెంకటాపురం గ్రామంలో శ్రీదేవి, శ్రీభూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం రమణీయంగా జరిగింది. కల్యాణ మహోత్సవంలో అర్చకులు, వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వందలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో దంపతులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు కుందూరుశివారెడ్డి, వెంకటేశ్వరమ్మ పెళ్లిపెద్దలుగా వ్యవహరించి స్వామివారి కల్యాణ తంతు జరిపించారు. అంతకుమునుపు దేవాలయంలో మహాసుదర్శన హోమం, పూర్ణాహుతి హోమం క్రతువులను నిర్వహించారు. సాయంత్రం స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో గ్రామోత్సవాన్ని జరిపారు.



అలంకరణలో స్వామి,అమ్మవార్లు

భగవద్గీత మతగ్రంథం కాదు

నంద్యాల(వ్యవసాయం): భగవద్గీత మతగ్రంథం కాదని, మానవుని జీవన విధానాన్ని నిర్దేశించే, నడిపించే గ్రంథమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భగవద్గీత కంఠస్థ, పఠన పోటీలకు హాజరయ్యారు. శారదా జ్ఞాన పీఠం పీఠాధిపతి శ్రీశివయోగేంద్ర సరస్వతి మాట్లాడుతూ భగవద్గీతను ఆచరిస్తే భవబంధములను పారదొలి జీవన ముక్తిని ప్రసాదిస్తుందన్నారు. విద్యార్థులకు బాల్యం నుంచే భగవద్గీతను నేర్పించాలని చెప్పారు. అనంతరం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి పోటీల విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. రాంప్రసాద్, రామశేషు, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో ఎంపీ పోచా

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత గొప్ప వరం



ఏవీ నారాయణరెడ్డిని సన్మానించిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి

నందికొట్కూరు: జిల్లా వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించడం గొప్ప వరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం పాములపాడు మండల పరిధిలోని భానకచర్ల గ్రామంలో జిల్లా వన్యప్రాణుల సంరక్షకులుగా నియమితులైన ప్రముఖ పారిశ్రామికవేత్త ఏ.వీ నారాయణరెడ్డిని, గ్రామ సర్పంచు ఆవుల జయసుధను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. మండలానికి ఆ పోస్టు దక్కడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. ఈయన వెంట గ్రామ ఉప సర్పంచు నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత



నాగేంద్రప్రసాద్ (ఫైల్)

పగిద్యాల: మండలంలోని కొత్త ముచ్చుమర్రి ప్రాథమిక పాఠశాలలో కనీస వేతనం కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేంద్రప్రసాద్(55) ఆదివారం తెల్లవారుజామున నందికొట్కూరులోని తన ఇంట్లో ప్రమాదవశాత్తు జారిపడి దుర్మరణం పొందారు. ఆయన కుటుంబానికి మండల ఉపాధ్యాయులు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మృతుని భార్య లతకు నగదు పారితోషికాన్ని అప్పగించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. 2022 జూన్‌లో కనీస వేతనం కింద (ఎంటీఎస్) విధుల్లో చేరిన నాగేంద్రప్రసాద్ ఏడాది కూడా గడువకముందే అకాల మరణం పొందడం బాధాకరమని ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి అన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉపాధ్యాయులు ముందుకు రావాలని ఎంఈఓ పిలుపునిచ్చారు. అలాగే నాగేంద్రప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. మానవత్వంతో స్పందించిన ఉపాధ్యాయులకు ఎంఈఓ సుభాన్ అభినందనలు తెలిపారు.



మృతుని భార్య లతకు ఆర్థిక సాయం అందిస్తున్న పగిద్యాల మండల ఉపాధ్యాయులు

30న మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో 2023–24 సంవత్సరపు రివైజ్డ్ బడ్జెట్ అంచనాలు, 2024–25 నూతన సంవత్సర బడ్జెట్ వివరాలు తయారు చేసి వాటి అమలు కోసం కౌన్సిలర్ల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. సమావేశానికి వార్డు కౌన్సిలర్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఆర్థిక సాయం

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన కుందు ఆనందరావు(62) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎల్లారెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తెలుగు సాంబ, అంజి, రాజేష్, సామేలు, శ్రీను, చెంచుబాలకృష్ణ, మీసేవ లక్ష్మణ్, శంకర్ తదితరులు మృతుని కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదును అందజేసి వారి ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు.

హక్కులపై సదస్సులు నిర్వహించండి

కొత్తపల్లి: వినియోగదారుల హక్కులపై మారుమూల గ్రామాలలో చైతన్య పరిచేందుకు సదస్సులు నిర్వహించాలని వినియోగదారుల రక్షణ మండలి జిల్లా అధ్యక్షుడు అమీర్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ కోరారు. ఆదివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నంద్యాల పట్టణంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ రాహుల్ కుమార్ రెడ్డిని కలిశారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా క్రయ విక్రయాలు చేస్తుండడంతో వినియోగదారులు చాలా నష్టపోతున్నారన్నారు. ఇటువంటి మోసాలు మారుగ్రామాలలో జరగకుండా వినియోగదారులను చైతన్య పరిచేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల వినియోగదారుల సంఘాల నాయకులు విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నందికొట్కూరు: పట్టణానికి చెందిన విద్యార్థిని ధరణి అదృశ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 23న పట్టణంలోని చాకలిపేట ఇంటి నుంచి తల్లిదండ్రులు శ్రీనివాసులు, రమాదేవి లేని సమయంలో సాయంత్రం వెళ్లిపోయింది. తల్లిదండ్రులు బంధువులు ఉన్న చోట విచారించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

మహిళ అనుమానాస్పద మృతి

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామానికి చెందిన రమణమ్మ (45) మహిళ శనివారం రాత్రి 10 గంటల సమయంలో మృతిచెందింది. లోబీపీతో మృతిచెందిందని కుటుంబసభ్యులు చెబుతున్నప్పటికీ ఆమె మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త మద్దిలేటి, కూతురు, కుమారుడు ఉన్నారు.

పీసీసీఎఫ్‌ను కలిసిన వైల్డ్‌లైఫ్ వార్డెన్



పీసీసీఎఫ్ మధుసూదన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పువ్వాడి భాస్కర్

ఆత్మకూరురూరల్: రాష్ట్ర అటవీ దళాల అధిపతి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్ రెడ్డిని హానరరి వైల్డ్‌లైఫ్ వార్డెన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వాడి భాస్కర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బైర్లూటిలోని నల్లమల జంగిల్ క్యాంప్‌లో విడిది చేసిన పీసీపీఎఫ్‌ను కలసి కిలిసి తనకు హానరరి వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. వన్యప్రాణి సంరక్షణకు తనవంతు సహకారం అటవీశాఖకు ఉంటుందని పీసీపీఎఫ్‌కు హామీ ఇచ్చారు. ఎన్ఎస్‌టీఆర్ ప్రాజెక్ట్ టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ మూర్తి, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావులను కూడా పువ్వాడి సత్కరించారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలి, అడ్వొకేట్ సుధాకరరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం అంగన్‌వాడీ వర్కర్లు యథావిధిగా నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నాయకురాళ్లు మంజుల, లక్ష్మీదేవి, సీఐటీయూ నాయకులు ఏసురత్నం, రామ్‌నాయక్ మాట్లాడుతూ నందికొట్కూరులో శాంతియుతంగా నిరస తెలుపుతున్న సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లను ఎస్ఐ మారుతీ శంకర్ దుర్భాషలాడడం సరికాదని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, లక్ష్మీదేవి, అరుణ, ప్రియాంక, వీరన్న , సురేంద్ర, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన దీక్షలు చేపట్టారు. వారికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాస్, సీఐటీయూ నాయకులు నాగమోహన్, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, రమణమ్మ, భాగ్యమ్మ, మేరమ్మ, రామతులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

మహానంది: ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును అప్పగించి ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ప్రకాశం జిల్లా వినుకొండకు చెందిన సుబ్రహ్మణ్యం ప్రసాద్ ఆదివారం గాజులపల్లె రైల్వే స్టేషన్ వద్ద ఆటో ఎక్కాడు. మహానందిలో ఆటో దిగి వెళ్లిపోగా డ్రైవర్ మాలిబాషాకు ఆటోలో పర్సు కనిపించింది. దీంతో దేవస్థానం సమాచారం కేంద్ర వద్ద ఇచ్చి అనౌన్స్ చేయించగా బాధితుడు విషయం తెలుసుకుని రావడంతో అతనికి పర్సు అందించారు. పర్సులో కొంత నగదుతో పాటు ఏటీఎం కార్డులు ఉన్నట్లు చెప్పారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నందికొట్కూరు: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నంద్యాల సంయుక్త ఆధ్వర్యంలో వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆంగ్ల వ్యాసరచన, వకృత్వ పోటీల్లో ఎం.సదాఫ్ ద్వితీయ స్థానం, తెలుగు వ్యాస రచన పోటీల్లో రెండో స్థానంలో కే. విజయలక్ష్మి, ఆంగ్ల వకృత్వ మూడోవ స్థానంలో జీ.జ్యోతిర్మయి నిలిచారు. ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రతిభ చాటిన విద్యార్థులకు అవార్డు అందజేశారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

హుండీ సొమ్ము లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలో రూ.1,36,962 రాగా, రెగ్యులర్ హుండీ నుంచి రూ.1,41,084 ఆదాయం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రామాంజనేయశర్మ, ఆలయ అర్చకుడు ప్రహ్లాదాచారి, కృష్ణమాచారి, దండె సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణ బిల్లు పెట్టాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్టీ పునరుద్ధరణ బిల్లును అసెంబ్లీ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపి 8నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లు ఆమోదం పొందేలా చూడాలన్నారు. రవి, సురేష్, రాఘవేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

శ్రీశైలంప్రాజెక్ట్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం ప్రాజెక్టులోని అన్ని చర్చిలకు చెందిన సంఘాలు క్రిస్మస్ ట్రోఫీ క్రికెట్ పోటీలను నిర్వహించాయి. కొద్దిరోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో క్రైస్తవ సంఘాలకు చెందిన యువకులు పాల్గొనగా ఆదివారం విజేతలకు నిర్వాహకులు కప్పులను అందజేశారు. తెలుగుబాప్టిస్ట్ టౌన్ చర్చి యువకులు మొదటి బహుమతి సాధించగా, రెండో బహుమతిని ఏబీఎం, మెయిన్‌చర్చి, మూడో బహుమతి సీఎంఆర్ చర్చి, నాల్గో బహుమతి లూథరన్ చర్చి యువకులు దక్కించుకున్నారు. వారికి తెలుగు విశ్వవిద్యాలయ డీన్ శ్రీనివాసులు, జలవనరుల శాఖ ఏఈ చిట్టిబాబు, ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌బాబు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ప్రకాష్ తదితరులు బహుమతులు అందజేశారు.



విజేతలకు కప్పులు అందజేస్తున్న నిర్వాహకులు